క్లుప్తంగా

సింహవాహనంపై వేంకటరమణుడు

మదనపల్లె సిటీ: శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం సింహవాహనంపై విహరించారు. ఉదయం అర్చకులు గోవర్ధన్‌భట్టార్ అభిషేకాలు,హోమాలు నిర్వహించారు. భక్తులు గోవిందనామ స్మరణలతో స్వామిని పురవీధుల్లో విహరించారు. ఉదయదార్లుగా దిగువకమ్మనపల్లె భక్తులు వ్యవహరించారు. సాయంత్రం హనుమంత వాహనంపై స్వామిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెమిడియల్ తరగతులు

మదనపల్లె సిటీ: ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో ఫెయిలైన విద్యార్థులకు సోమవారం నుంచి రెమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బి. బాలకృష్ణమూర్తి తెలిపారు. 23వ తేదీ వరకు తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్‌లో ఫెయిలైన వారు ఈనెల 4లోపు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

యువత ఐకమత్యంగా మెలగాలి

నిమ్మనపల్లె : యువకులు కలిసికట్టుగా ఉండి ఐక్యతతో మెలగాలని సాఫ్ట్‌వేర్ ఇంజినీరు రమేష్ అన్నారు. మండలంలోని తవళం పంచాయతీ నల్లంవారిపల్లెలో జరిగిన క్రికెట్ టెర్నమెంట్ విజేతకు ఆదివారం రమేష్, స్నేహితుల బృందం నగదు బహుమతి రూ.20,116లు అందజేశారు. యువకుల్లో ఐక్యత తెచ్చేందుకు, గ్రామానికి చెందిన సోమశేఖర్ జ్ఞాపకార్థంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రతాప్ శ్రీనివాసులు, గంగాధర, చిన్నా, మనోహర్, మంజునాథ్, ప్రకాష్, మహదేవ పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ కేంద్రం ఏర్పాటు

కలికిరి: కలికిరికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు చీనేపల్లి తరుణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరమ్మకాలని, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వేసవితాపంతో ఇబ్బంది పడే ప్రజలకు కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్టాండ్ వద్ద మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా సేవా కార్యక్రమాల్లో ముందుంటామని పేర్కొన్నారు.

జాతీయచేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్



నియామకపత్రం అందుకుంటున్న శ్రీధర్

మదనపల్లె : జాతీయచేనేత ఐక్యవేదిక, ఆంధ్రప్రదేశ్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా మదనపల్లెకు చెందిన వేల్పుల శ్రీధర్ నియమితులయ్యారు. ఆదివారం తిరుపతి పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయచేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డి బాబు, ఎమ్మెల్సీ పోతులసునీత చేతుల మీదుగా వేల్పుల శ్రీధర్ నియామకపత్రాన్ని అందుకున్నారు. సభ్యులందరి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లె పంచాయతీ సబ్‌స్టేషన్ సమీపంలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ఘనంగా జాతర నిర్వహించారు. పూజారి రెడ్డి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందినీబండ్లు, రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింపజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు శ్యామలమ్మ, నాయకులు రమణారెడ్డి, రఘునాథ్, నారాయణరెడ్డి, కోటిరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన భక్తిగీతాల ఆలాపన

మదనపల్లె సిటీ: స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలో ఆదివారం భక్తిగీతాల ఆలాపన అలరించింది. మన సృంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కళాకారులు 108 భక్తిగీతాలు ఆలపించారు. కళా సంస్థ అధ్యక్షులు రెడ్డప్ప మాట్లాడుతూ మారుమూల గ్రామాలోని ప్రజలు శ్రమైక జీవన సౌందర్యాన్ని పొందుతూ పాడుకున్న పాటలు రోజు రోజుకు కనుమరుగవుతున్నాయన్నారు. మన కళలు అంతరించిపోకుండా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమం గౌరవ అధ్యక్షులు గంగిరెడ్డి, వేమనారాయణ, పోతబోలు రెడ్డప్ప, లక్ష్మినారాయణ,రామాలయ కమిటీ సభ్యులు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత..నమోస్తుతే..!



పీలేరు రూరల్: కన్యకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పీలేరు రూరల్ : స్థానిక నెహ్రూబజార్‌లో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ప్రాతఃకాల పూజలు, అభిషేకం, అర్చన, దీక్షా హోమం, రుద్రహోమం, సుదర్శనహోమం, ధనతరి హోమం, నవగ్రహ హోమం, ప్రధాన దేవతల హోమాదులు చేశారు. అలాగే కార్తవీర్యార్జునాస్త్ర హోమం, మహా కుబేర పాశుపత హోమం, మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, మహా నైవేద్యం, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం అమ్మవారి పుష్పపల్లకీ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మల్లికార్జునశెట్టి, బాలసుబ్రమణ్యం, కిషోర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ జయంతి

మదనపల్లె సిటీ: స్థానిక వాసవీ భవన్ వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయంలో హోమాలు నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మహిళలు,కన్యకలు, దంపతులచే గంగను తీసుకువచ్చారు. దీంతో అమ్మవారికి అభిషేకాలు, పాలాభిషేకం చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణం పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారిని పుష్పపల్లకిపై పురవీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్, ఉపాధ్యక్షులు గిరిధర్, ప్రవీణ్,కృష్ణారావు, వాసవీ మహిళా సంఘం, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం: రామసముద్రం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక హోమాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ : మండలకేంద్రంలో వాసవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. 108 కళశాల పవిత్ర జలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌కుమార్‌శర్మ, నిర్వాహకులు మేస్త్రీ వెంకటేష్, మాకం వెంకటేశ్వర్లు, రవి, వెంకటేష్‌లు పాల్గోన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారి ఆలయంలో నవగ్రహ శాంతి హోమం, గంగపూజ, జలాభిషేకం, చిలకలపూజ, శ్రీ సత్యలక్ష్మీ కల్యాణం, శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణం వేద మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త టి.జి. సతీష్, నవీన్ కుమార్, పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

బంగారు చీర అలంకరణలో..

బి.కొత్తకోట : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు హాజరై కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు.

గ్రామ వీధుల్లో ఊరేగింపు

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆర్య వైశ్యులు వాసవి జయంతి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిమలను సుందరంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీలో గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు.





మదనపల్లె సిటీ: గంగను తీసుకువస్తున్న ఆర్యవైశ్య మహిళలు, గుర్రంకొండ : వాసవీ జయంతి వేడుకలో మహిళలు, వాల్మీకిపురం : ప్రత్యేకాలంకరణలో కన్యకాపరమేశ్వరి

అంబేడ్కర్ గొప్ప మానవతావాది



అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే

పెద్దతిప్పసముద్రం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప మానవతావాది అని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారనాథ్‌రెడ్డి అని అభివర్ణించారు. ఆదివారం ఆయన మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లిలో బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు శివ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగు జాడల్లో నడుస్తూ, ఆయన ఆశయ సాధనలో పాలు పంచుకోవాలని కోరారు. బాస్ నాయకులు సింగన్న, సచిన్, రామచంద్ర, కాట్నగల్లు రమణ, లక్ష్మినారాయణ, కదిరప్ప, అంజనప్ప, ముని వెంకటప్ప,రామప్పతదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ యాత్ర బస్సులు సద్వినియోగం చేసుకోండి



స్పెషల్ యాత్ర కరపత్రాలు పంపిణీ చేస్తున్న మార్కెటింగ్ టీమ్ సభ్యులు

పీలేరు రూరల్ : పీలేరు ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నడుపుతున్న స్పెషల్ యాత్ర బస్సులను పర్యాటకులు, భక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కుమార్ కోరారు. ఆదివారం డిపో మార్కెటింగ్ టీమ్ కరపత్రాలు అందజేసి ఆర్టీసీ సర్వీసులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆమట్లాడుతూ పీలేరు నుంచి అరుణాచలం, భద్రాచలం, మున్నార్, ఊటి, కొడైకెనల్, మధురై, వేలంగిణి ప్రాంతాలకు ప్రత్యేక యాత్ర సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. మే 4న అరుణాచలంకు, 25న భద్రాచలంకు యాత్ర సర్వీసులు నడుతుపుతున్నట్లు తెలిపారు. భద్రాచలం టూర్ నాలుగు రోజులు ఉంటుందని, ఇందులో సీతమ్మ పర్ణశాల, రామయ్య తండ్రి నివాసము, జలపాతం, జూపార్క్, రాజమండ్రి గుంటిపోచమ్మ, బోటు ప్రయాణం, పాపికొండలు, వివిధ రకాల షూటింగ్ ప్రాంతాలు సందర్శించే విధంగా ఉంటుందని తెలిపారు. వివరాలకు మార్కెటింగ్ టీమ్ కల్లూరి వెంకటరమణ 7893152748, ప్రమీల 7382878751 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా



సన్‌షైన్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ఆదివారం సీటీఎంరోడ్డు, జీఆర్‌టీ జ్యువెలరీస్ పక్కన నూతన సన్‌షైన్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మదనపల్లెలో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించేందుకు అత్యున్నత ప్రమాణాలతో, అధునిక వైద్యసదుపాయాలతో సన్‌షైన్ ఆస్పత్రిని ఏర్పాటు చేయడంపై వైద్యులు ఫహీమ్ నవాజ్, పి.సాజిదాబేగమ్‌లకు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్.ఫహీమ్‌నవాజ్ మాట్లాడుతూ.. పట్టణంలో పదేళ్లుగా స్త్రీ, ప్రసూతి వైద్యసేవలు, ఎండోస్కోపిక్, ల్యాప్రొస్కోపిక్ సర్జన్‌గా సేవలు అందిస్తున్నామని, ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఫాతిమా మెడికల్ కళాశాల వైద్యులు ఎస్.ఎం.డి.అబ్దుల్‌రజాక్, డీఎస్పీ కేశప్ప, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులు, కౌన్సిలర్ వసీం, బావాజాన్, క్రిస్టియన్ మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడు బి.జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికం సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల

కలికిరి: మండల పరిధిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో వి.ఫజులుల్లా, పిడుగుపాటుకు గుర్రై కె.జహంగీర్ మృతి చెందారు. ఆ కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. బాధితులు, మండల వైఎస్సార్‌సీపీ నేతలు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిని కలిసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే చొరవతో ఒకొక్క కుటుంబానికి ప్రభుత్వం నుంచి లక్ష రూపాయలు వంతున ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు ఆదివారం మండలంలోని నర్రావాండ్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నూర్జహాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫయాజ్, బావాజీ, రవీంద్రారెడ్డి, మదార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ నాటక ఘట్టం

కలకడ : మండలంలోని కోన పంచాయతీ తిప్పిగారిపల్లె లో ధర్మకర్త కాంతారావ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ నాటక ఘట్టం ఎంతో ఆకట్టుకుంది. 18 పర్వాలుగా ఉన్న మహాభారత యజ్ఞంలో భాగంగా పగలు హరికథలు, రాత్రి నాటకాలు ప్రేక్షకులను ఎంతో అలరించాయి. కోన, గుడిబండ, రాతిగుంటపల్లె, దేవులపల్లె, పంచాయతీల పరిధిలోని 26 గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు నాటక ఘట్టాలను తిలకించారు.

శ్రీచౌడేశ్వరిదేవి ఆలయానికి నీటి ట్యాంక్ వితరణ

కలకడ : మండలకేంద్ర మైన కలకడలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయానికి ట్రూప్లో కంపెనీకి చెందిన రాయలసీమ జోన్ సిబ్బంది ఎంఎస్ రాజు, ఎస్.మురళీక్రిష్ణ, సురేంద్ర కలసి రూ.20 వేలు విలువచేసే మంచినీటి ట్యాక్, పైపులు, కుళాయిలు వితరణ చేశారు. ఆదివారం కలకడలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జయరాం, జీపు లక్రిష్ణ, రాజేంద్ర, గాలిరెడ్డెప్ప, శ్రీనాథ్, ప్రసాద్, ఓబులేశు, రామ్మోహన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం

మదనపల్లె సిటీ: స్థానిక రెడ్డప్పనాయుడుకాలనీలోని శాఖ గ్రంథాలయంలో ఈనెల 8 నుంచి ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు శాఖ గ్రంథాలయాధికారి వసంత తెలిపారు. ఉదయం 8 నుంచి 12 వరకు 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యోగా మెడిటేషన్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ ఇతర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఉచిత అంశాలలో శిక్షణ ఇవ్వడానికి ఆస్తిగల టీచర్లు, రిటైర్డు ఉద్యోగులు గ్రంథాలయాధికారిని సంప్రదించాలని కోరారు.

వేడుకగా వీరబ్రహేంద్రస్వామి జయంతి

బి.కొత్తకోట : పోతులూరి వీరబ్రహేంద్రస్వామి జయంతి వేడుకలు ఆదివారం బి.కొత్తకోట మండలంలో ఘనంగా నిర్వహించారు. బీరంగిలో బ్రహ్మయ్య జీవ సమాధి అయిన సందర్భంగా ట్రాక్టర్‌పై ఆయన చిత్రపటంతో ఊరేగింపు జరిపారు. కోలాట, భజనలు చేశారు. కార్యక్రమంలో మేకల వెంకటేష్, కుమ్మర నరసింహులు, పాకాల శంకర, కేశవ, బిల్లురి పాపన్న, గుడిపల్లె వెంకటరమణ, గుడిపల్లె కృష్ణ, సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. అలాగే బి.కొత్తకోటలో నగర పంచాయతీ కార్మికుడు శివ ఆధ్వర్యంలో వేడుక నిర్వహించి నివాళులర్పించారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష ఆదరణ

- ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల నుంచి జగన్‌ను వేరు చేయలేరు
- దేశంలోని అన్ని రాష్ట్రాలు ఏపీ పాలనను ఆదర్శంగా తీసుకుంటున్నాయి
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పెద్దతిప్పసముద్రం: రాష్ట్రంలోని ప్రతిపక్షాల నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల నుంచి సీఎం వైఎస్ జగన్‌ను వేరు చేయలేరని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా పీపుల్స్ మెగా సర్వేలో వచ్చిన ప్రజాదరణే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం ఆయన పీటీఎంలో మండలంలోని వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల పాలకులు ఏపీలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, సీఎం వైఎస్ జగన్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. తంబళ్ళపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం రూ.కోట్ల నిధులు వెచ్చించారని ఇందులో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి ఫ్లోరైడ్ రహిత తాగునీరు అందించేందుకు రూ.2,450 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. తాగునీరు, విద్యుత్ కొరత నివారణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రాబోవు కాలంలో పరిశ్రమల ఏర్పాటును దృష్టిలో ఉంచుకుని కొత్తగా మరో ఏడు సబ్ స్టేషన్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఒక్క పీటీఎం మండలంలోనే గతంలో కన్నా అధికంగా 7,800 మందికి రూ.2.07 కోట్ల నిధులను నెలవారి పింఛన్ సొమ్ము అందజేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల రూపంలో ఈ నాలుగేళ్ళలో రూ.50.44 కోట్ల నిధులు లబ్ధిదారుల ఖాతాలకు జమ అయిందన్నారు. ప్రతి వలంటీర్ వారి పరిధుల్లో ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి అర్హులు ఇంకా ఎవరైనా ఉంటే వారికి లబ్ధి చేకూర్చాలని హితబోధ చేశారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సురేంద్రనాథ్, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, డ్రిప్ రమణ, సుబ్బరాం, కుమార్‌రెడ్డి, సురేంద్ర, రియాసత్ అలీఖాన్, ధనలక్ష్మితో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా దేవర ఎద్దు ఎన్నిక

– ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



మేడిపల్లె గ్రామంలో దేవర ఎద్దు ఎన్నిక మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : మండలంలోని చీకలబైలు పంచాయతీ ఎగువమేడిపల్లెలో ఆదివారం గజ్జెలముడి వంశస్థుల ఆధ్వర్యంలో నూతన దేవర ఎద్దు ఎన్నిక సంప్రదాయబద్ధంగా జరిగింది. ఉదయం మేడిపల్లె ఆలయంలో పూజాకార్యక్రమాలతో లాంఛనంగా దేవర ఎద్దు ఎన్నికను ప్రారంభించారు. ఎగువ, దిగువ మేడిపల్లె, టేకులపాళ్యంతో పాటుగా సమీప గ్రామాలకు చెందిన ప్రజలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. దేవర ఎద్దు ఎన్నికలో భాగంగా ఏర్పాటుచేసిన దేవుడి ఫలహారాన్ని దిగువమేడిపల్లెకు చెందిన చిన్నచెంద్రాయప్పకు చెందిన కోడెదూడ ఆరగించింది. దీంతో గజ్జలముడి వంశస్థులు దానిని దేవర ఎద్దుగా ప్రకటించారు. అనంతరం పిల్లనగ్రోవులు, మేళతాళాలు, చెక్కభజనలతో గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. మేడిపల్లెలో దేవర ఎద్దు ఎన్నిక సందర్భంగా జరిగిన గ్రామోత్సవానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గజ్జలముడి చలపతినాయుడు, చంద్ర, గ్రామస్తులు ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులు, బాబురెడ్డి, సదాశివనాయుడు, సిద్ధేశ్వర్, రత్నంనాయునివారు, కంచంగిరిబాబు, రాజగోపాల్, నరసింహులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు మంచిచేస్తున్న ఎంపీపై విమర్శలు తగవు

– వాల్మీకి, బలిజ, ఎస్సీ నాయకులు



మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెమ్మ, సర్పంచ్ ఆనంద పార్థసారథి తదితరులు

మదనపల్లె : బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేసిన ఇతర పార్టీల నాయకుల్లా కాకుండా వారి ఆకాంక్షలను తెలుసుకుని నెరవేర్చేందుకు ప్రయత్నించిన ఎంపీ మిథున్‌రెడ్డిని విమర్శించడం తగదని ఎంపీపీ రెడ్డెమ్మ, వాల్మీకి సంఘం నాయకులు దొడ్డిపల్లెఆనంద్, బలిజనాయకులు ఆనంద పార్థసారథి, బోర్‌వెల్‌మహేష్, ఎస్సీ నాయకులు వెలుగుచంద్ర అన్నారు. ఆదివారం బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెలగౌతమ్ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై చేసిన ఆరోపణలపై వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు బలిజ సేవా సమితి ఆధ్వర్యంలో గత ప్రభుత్వాలకు అనేక మార్లు విన్నవించుకున్నా ఏ నాయకుడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. టీటీడీ బోర్డ్‌మెంబర్ పోకలఅశోక్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతిల ద్వారా బలిజసేవాసమితి సభ్యులు ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే తక్షణమే స్పందించి విగ్రహ ఏర్పాటుకు అనుమతితో పాటుగా సొంత నిధులతో విగ్రహాన్ని తయారుచేయించి ఇచ్చారన్నారు. పట్టణంలో పాతికేళ్లుగా నెరవేరని బలిజల ఆకాంక్ష ఫలించిందటే అది కేవలం ఎంపీ మిథున్‌రెడ్డితోనే సాధ్యమైందన్నారు. అలాగే బోయ,వాల్మీకులు 20 ఏళ్లుగా కమ్యూనిటీ భవన నిర్మాణానికి సంబంధించి విశ్వప్రయత్నాలు చేసినా గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి వాల్మీకి కమ్యూనిటీభవనానికి స్థలంతో పాటుగా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.50లక్షల నిధులు కేటాయించారన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ కులాలకు సంబంధించి రాజకీయ,నామినేటెడ్ పదవుల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్ కేటాయించడంతో పాటుగా సామాన్యులను సైతం ఉన్నతపదవుల్లో అలంకరించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. మైనారిటీలకు సంబంధించి టిప్పు సుల్తాన్ మసీదుకు రూ.5కోట్లు, కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి రూ.2కోట్లు ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో మంజూరయ్యాయన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ రామచంద్ర

కలకడ : గ్రామంలో రామాలయ నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ రామచంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు భూమి పూజ చేశారు. మండలంలోని గంగాపురం పంచాయతీ షేర్‌ఖాన్‌వంక బండకిందవడ్డిపల్లె గ్రామంలో 30 కుటుంబాలు వారు నివసిస్తున్నారు. అక్కడ ఎలాంటి ఆలయం లేదని గ్రామస్తులు తెలపడంతో నూతన ఆలయం నిర్మాణం కోసం నాయకులు ముందుకు వచ్చారు. నూతన ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, బివి నాయుడు, ప్రసాద్, రవి, రాజు, రాణి, ఆదినారాయణ, అనిల్, మన్మథనాయుడు, జనార్దన్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కూలీల ఇంట విద్యా కుసుమాలు

- ఇంటర్ పరీక్షల్లో పేదింటి బడ్డల సత్తా
- కార్పొరేట్‌కు దీటుగా రాణింపు
- పై చదువులకు దాతల సాయం కోసం ఎదురు



తల్లిదండ్రులతో ఎంపీసీ విద్యార్థి కార్తీక్



తండ్రి నజీర్ అహ్మద్‌తో విద్యార్థిని సబియా

నిమ్మనపల్లె : వారు పేదరికంలో పుట్టారు. తల్లిదండ్రులు కూలీ, నాలీ చేసి బిడ్డలను పోషిస్తున్నారు. అమ్మానాన్న కష్టాన్ని కళ్లారా చూసిన పేదింటి బిడ్డలు విద్యకు పేదరికం లేదని నిరూపిస్తూ ఇంటర్ పరీక్షల్లో సత్తా చాటారు. కూలీల ఇంట సరస్వతీ పుత్రులు అయ్యారు. నిమ్మనపల్లె మండలంలో ప్రభుత్వ కాలేజీల్లో చదివి కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల నేపథ్యం.

చేనేత కూలీ ఇంట సరస్వతీ పుత్రుడు

మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ బాలినాయునిపల్లెకు చెందిన కె.నరసింహులు దివ్యాంగుడు పింఛన్‌పై ఆధారపడి జీవిస్తూ, అడపాదడపా చేనేత కార్మికునిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ పోషణలో భార్య పద్మావతి సహకరిస్తూ చేనేత కూలీ పనులకు వెళ్తుంది. వీరి కొడుకు కె.కార్తీక్ నిమ్మనపల్లె ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎంపీసీ విభాగంలో విద్యను అభ్యసించాడు. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో రెండో సంవత్సర ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకుగానూ 931 సాధించి శభాష్... అనిపించుకున్నాడు. ఉత్తమ మార్కులు సాధించిన కార్తీక్ తాను ఎంసెట్‌కు ప్రిపేర్ అవుతున్నానని, ఇంజనీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అవుతానని అంటున్నాడు. అయితే తన తల్లిదండ్రులు చదివించే స్తోమత లేదని దాతల సహాయం చేయాలని అభ్యర్థిస్తున్నాడు.

రాతి కార్మికుడి ఇంట చదువుల పంట

చిత్తూరు జిల్లా వి.కోట మండలం మురగందొడ్డి పంచాయతీ ఎం.ఎం.కుంట గ్రామానికి చెందిన షేక్ నజీర్ అహ్మద్ బండ పగులగొడుతూ రాతి కార్మికునిగా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య షకీలాబీతోపాటూ నలుగురు ఆడ సంతానం ఒక మగ సంతానాన్ని పోషించేందుకు ఇబ్బందులు పడుతున్నాడు. అందులో భాగంగా పోషించలేక ఒక అమ్మాయిని బంధువులకు దత్తత ఇచ్చాడు. పెద్ద కుమార్తె సుఫియా వివాహం కాగా రెండో కుమార్తె సబియా నిమ్మనపల్లె మండలం ముస్టూరు కేజీబీవీ విద్యాలయంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసించింది. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో రెండో సంవత్సర సీఈసీ విభాగంలో 1000 మార్కులకుగానూ 950 మార్కులు సాధించి ఔరా... అనిపించింది. తనకు సీఏ చేయాలని ఉందని, అందుకై కోచింగ్ తీసుకుంటున్నానని, సుబియా తెలిపింది. అయితే తన తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమేనని, సీఏ చేయాలంటే ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయని, బంధువులు అంటున్నారని, వాటిని అధిగమించేందుకు దాతలు తన చదువుకు సాయం చేయాలని కోరింది.